విశాఖ స్టీల్‌ప్లాంట్ ని విక్రయించనని మోడీ ప్రకటనచేయాలి

-ప్రజా సంఘాల డిమాండ్ -కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో



విశాలాంధ్ర-విజయనగరంటౌన్: ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈ నెల 12న జరిగే బహిరంగ సభలో స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించబోనని ప్రకటించాలని కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్టీల్‌ప్లాంట్ పై మోడీ ప్రకటించాలని, విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐటియుసి నాయకులు బుగత అశోక్, సిఐటియు నాయకులు రెడ్డి శంకరరావు, ఐఎన్‌టియుసి నాయకులు ఎం.శ్రీనివాసరావు లు మాట్లాడుతూ 2021 జనవరి 27న కేంద్రం స్టీల్‌ప్లాంట్‌ను విక్రయానికి పెట్టిందన్నారు. ఈ కాలంలో రాష్ట్రం నిరసనలతో అట్టుడికిపోయిందని, మూడుసార్లు సమ్మెలు, రెండుసార్లు బంద్‌లు జరిగాయని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఆశలను మోడీ పరిగణలోకి తీసుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌ను సొంతగనులు ఇచ్చి వందశాతం సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరించడానికి స్టీల్‌ప్లాంట్ మోడీ సొంత సొత్తు కాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కై మోడీ ప్రకటన చేయకపోతే ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించడం ఖాయమని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రధానిమంత్రి తో స్టీల్‌ప్లాంట్ పై స్పష్టమైన ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అన్యాయం చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ధర్నాలో సిఐటియు నాయకులు ఏ.జగన్మోహన్, సురేష్ మెడికల్ రీప్స్ యూనియన్ నాయకులు యు ఎస్ రవికుమార్, శ్రామిక మహిళా సంఘం నాయకులు బి.సుధారాణి, ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష, ఏఐటియుసి అధ్యక్షులు రంగరాజు కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ విశాఖ పర్యటన వ్యతిరేకించండి

సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీలు బొబ్బిలి ఎన్టీఆర్ బొమ్మ సెంటర్లో నిరసన



బొబ్బిలి: రాష్ట్రానికి తల మాణికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ను అమ్మేస్తున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ లేదు. విశాఖ రైల్వే జోన్ లేదు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా ద్రోహం చేసింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు మోడీని మోడీ ప్రభుత్వాన్ని నిలయకుండా మన హక్కులు సాధించుకోవడానికి ప్రయత్నం చేయకుండ మోడీ విశాఖ పర్యటనలో ముఖ్యమంత్రి అడుగులకు మడుగులెత్తడం ఆంధ్రప్రదేశ్ కు తీవ్రమైన నష్టం చేస్తున్నారని సిపిఎం బొబ్బిలి నియోజకవర్గం నాయకులు పి. శంకరరావు ఏఐటియుసి జిల్లా డిప్యూటీ సెక్రటరీ మునకాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. విశాఖలో జరిగే ప్రధాని పర్యటనలో జగన్మోహన్ రెడ్డి ప్రధానమంత్రిని మన రాష్ట్ర సమస్యల పరిష్కారానికి నిలదీయాలని డిమాండ్ చేశారు. ప్రజలంతా మోడీ పర్యటనను నిరసించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. అప్పన్న, డివైఎఫ్ఐ నాయకులు ఎ. సురేష్ గ్రోత్ సెంటర్ సీఐటీయూ కార్యదర్శి ఎస్. గోపాల్ కార్యకర్తలు పాల్గొన్నారు.



మోడీ గో బ్యాక్ అంటూ సిపిఐ నిరసన

గజపతినగరం: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గో బ్యాక్ అంటూ సిపిఐ నాయకులు కార్యకర్తలు సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు శుక్రవారం గజపతినగరంలో నిరసన తెలియజేశారు. సిపిఐ ఏరియా కార్యదర్శి ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించి ఎందుకు వస్తున్నావ్ అని ప్రశ్నించారు. ప్రత్యేక హెూదా విశాఖ రైల్వే జోన్ ఉత్తరాంధ్ర ప్యాకేజీలు ఏమయ్యాయని అన్నారు. విశాఖ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి గేదెల రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ ని విశాఖ రాకుండా అడ్డుకోవాలి



రామభద్రపురం: దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం విశాఖ రాకుండా ప్రజలందరూ అడ్డుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు కోరారు. శుక్రవారం ఆయన రాక సందర్భముగా మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిపిఐ సిపిఎం నాయకులతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు నరేంద్ర మోడీ ఏం చేశారని ఆంధ్రలో అడుగుపెడుతున్నారని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులకు దేశాన్ని తాకట్టు పెట్టారని అన్నారు. వైజాగ్ ప్రజలు విశాఖ స్టీల్ ప్లాంట్ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని నరేంద్ర మోడీ గో బ్యాక్ గో బ్యాక్ అంటూ, తరిమికొట్టాలని అన్నారు. సిఐటియు నాయకులు బలస శ్రీను దేశంలో, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేసి అధానీ, అంబానీలకు ప్రభుత్వ సంపదను దోచిపెడుతున్నారన్నారు. విశాఖను 20 రైల్వేజోన్ చేస్తామని చెప్పి మోసగించిన మోడీకి ప్రజలు తగిన బుద్ధి దగ్గర్లోనే చెప్తారన్నారు. శనివారం జరగబోయే నరేంద్ర మోడీ సభను ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లేంక లక్ష్మి, సామి రెడ్డి అప్పలనాయుడు, రవ్వ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పిల్లవాడు చదువుకోవడమే అబుల్ కలాం కు నిజమైన నివాళి

కలెక్టర్ సూర్యకుమారి



విశాలాంధ్ర-విజయనగరం: జాతి యావత్తూ నిత్యం స్మరించుకోవలసిన వ్యక్తి అబుల్ కలాం ఆజాద్ అని కలెక్టర్ ఎ.సూర్య కుమారి పేర్కొన్నారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రి గా పని చేస్తూ అనేక విద్యా సంస్థలను ఏర్పాటు చేశారని, అందుకే వారి జయంతిని జాతీయ విద్యా దినోత్సవం గా జరుపుకుంటున్నామని అన్నారు. అబుల్ కలాం ఆజాద్, ప్రముఖ సంగీత విద్వాంసుడు కనకదాస జయంతి వేడుకలను కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పిల్లవాడు బడికి వెళ్లి చదువుకోవడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి యని అన్నారు. జిల్లాను శత శాతం అక్షరాశ్యత దిశగా మార్చడానికి కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే వయోజనులకు చిట్టి గురువులు అనే కార్యక్రమం ద్వారా అక్షరాస్యు లను చేస్తున్నామనిఈ నెల 13 న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తద్వారా సత్తా శాతం అక్షరాస్యత సాధించ గలమనే ఆశిస్తున్నట్లు తెలిపారు. కనకదాస గురించి మాట్లాడుతూ టిటిడి లో అం అన్నమయ్య కీర్తనలకు ఎంతటి విశిష్టిత ఉందొ కనకదాస కీర్తనలకు అంతే విశిష్టత ఉందని పేర్కొన్నారు. చదువు, సంగీతం రెండింటి లో ప్రముఖులైన వారిని ఒకే రోజున స్మరించుకోవడం విశేషమని తెలిపారు. లీడ్ ఇండియా ప్రతినిధి ఆచార్య వాసుదేవ్ మాట్లాడుతూ మనిషి స్థాయిని పెంచేది విద్య మాత్రమేనని భావించిన అబుల్ కలాం శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించడానికి పరిశోధనా కళాశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ గణపతి రావు, డి.ఈ.ఓ వెంకటేశ్వర రావు, సి.పి.ఓ బాలాజీ, వయోజన వైద్యాధికారి సుగుణకర రసో, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రామనందం, బిసి సంక్షేమ అధికారి యశోధన రావు, ఈ.డి పెంటోజీ రావు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ నాజిర్, ముస్లిం ప్రతినిధులు రహీం, బాషా, కరీం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల వివరాలు నోటీస్ బోర్డ్ లో పొందుపరచాలి

ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి రవికుమార్ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి: కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా చేస్తున్న ఫీజులు దోపిడీ వెంటనే అరికట్టాలని ఏదైతే ప్రభుత్వం ఫీజులు నిర్ణయించిందో ఆ ఫీజులు వివరాలను ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు నోటీస్ బోర్డ్ లో పొందుపరచాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విద్యార్థులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించి విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చుతున్నారని ఈ అక్రమ ఫీజులను అరికట్టవలసిన విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, దీనినే ఆసరాగా తీసుకుని ప్రైవేట్ విద్యాసంస్థల యాజ మాన్యాలు ఎప్పటికప్పుడు ఫీజులు పెంచుతూ విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎటువంటి మౌలిక సదుపా యాలు లేకపోయినా కనీస విద్యా ర్హతలు కలిగిన ఉపాధ్యా యులను కూడా నియమించ కుండా విద్యాసంస్థలను నడుపుతున్నారన్నారు. ఇకనై నా జిల్లా విద్యాశాఖ అధికారులు కళ్ళు తెరిచి ఏదైతే ప్రభుత్వ నిబంధనలను పాటించని కార్పొరేట్ ప్రైవేటు విద్యా సంస్థ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని వారి గుర్తింపు రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.లేనియెడల భవిష్యత్తులో విద్యార్థులను ఐక్యం చేసి చలో డీఈఓ ఆఫీస్ ముందు ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు పార్థు, వినయ్,వికాస్,సాయి తదితరులు పాల్గొన్నారు. ..

గుర్ల లో మండల మహిళా సమావేశం



విశాలాంధ్ర-గుర్ల: మండల సమాఖ్య కార్యాలయం గుర్ల నందు గ్రామ సంఘ అధ్యక్షులు మరియు గ్రామ సంఘ సహాయకులు కు (వీఓఏలు) సమావేశం మండల సమాఖ్య అధ్యక్షురాలు బి.సన్యాసమ్మ అధ్యక్షతన సమావేశం ఏర్పాటుజరిగింది. ఈ సమావేశం లో ఏపీఎం పి.నారాయణరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు మహిళల అభివృద్ధికి ప్రేవేశపెడుతుందని అందులో ముఖ్యంగా వైస్సార్ ఆసరా,వైస్సార్ సున్నవడ్డీ,వైస్సార్ చేయూత, జగనన్న తోడు చిరు వ్యాపారులకు చేయూత నిస్తుంది వీటితో పాటు బ్యాంక్ లింకేజీ మరియు స్త్రీనిది ద్వారా అప్పులు తీసుకొని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేసి తద్వారా ఆ కుటుంబం అదనపు ఆదాయం సంపాదించేలా ప్రతీ సభ్యురాలికి అవగాహన కల్పించి వారిని ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్త్రీనిది మేనేజర్ వై.ఎర్రి నాయుడు మాట్లాడుతూ ఆదాయాభివృద్ధి నిమిత్తం అప్పు కావలసిన సభ్యులకు స్త్రీనిది రుణాలు మంజూరు చేయాలని అన్నారు,

సెపక్ తక్రా పోటీలకు జిల్లా జట్టు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఈనెల 12,13 తేదీలలో ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ 26వ జూనియర్ సెపక్ తక్రా పోటీలు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన జిల్లా జట్టు శుక్రవారం బయలుదేరారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు డిసెంబర్ ఐదు నుండి తొమ్మిదవ తేదీలలో బీహార్ రాష్ట్రం పాట్నాలలో జరిగే 26వ నేషనల్ ఛాంపియన్షిప్‌లో పాల్గొంటారు. ఈ సందర్భంగా వీరిని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు జి అయ్యలు, కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు మాట్లాడుతూ క్రీడాకారులంతా ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైరాజేష్, జె రామారావు, పి భవాని పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు రైతులకు అందేలా చూడాలి



విశాలాంధ్ర-గజపతినగరం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు రైతులకు అందేలా చూడాలని గజపతి నగరం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడ్రాజుఅన్నారు. శుక్రవారం గజపతినగరం మండలంలోని పురిటి పెంట రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలో ఈ క్రాప్ నమోదు చక్కగా చేసేందుకు గ్రామ వ్యవసాయ నాయకులకు అభినందించారు. గజపతినగరం సబ్ డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు కే మహారాజన్ మాట్లాడుతూ రైతులకు వరి కొనుగోలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ధనలక్ష్మి డాక్టర్ వెంకటరమణ ఉద్యానవన శాఖ అధికారి డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరు గా నమోదు చేసుకోవాలి



విశాలాంధ్ర-రామభద్రపురం: 18 సంవత్స రాలు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరు గా నమోదు చేసుకోవాలని స్థానిక తాసిల్దార్ గణపతి రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రం లో చొక్కాపు రామనాయుడు డైట్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు సే ఓటర్ నమోదు కార్యక్రమం పై కళాశాల నుంచి గాంధీ బొమ్మ కోడలు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఓటు పవిత్రమైందని అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు ఓటర్ నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రాడ్యుయేట్ శాసనమండలి ఎన్నికలు జరగనున్నాయని కావున గ్రాడ్యుయేట్ చదివిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఆర్ అదనపు ఎస్పీగా బాధ్యతలు

విశాలాంధ్ర -విజయనగరం క్రైమ్ : జిల్లా ఆర్మ్డ్ రిజర్వు అదనపు ఎస్పీగా ఎం.ఎం. సోల్మన్ శుక్రవారం ఆర్మడ్ రిజర్వు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పోస్టు గ్రాడ్యుయేషన్, న్యాయ శాస్త్రంలో పట్టభద్రులైన సోల్మన్ 1991లో ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో రిజర్వు సబ్ ఇన్స్పెక్టరుగా పోలీసుశాఖలో చేరి, 1999 రిజర్వు ఇన్స్పెక్టరుగా,2010లో డిఎస్పీ, 2021లో అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతులు పొందారు. విశాఖపట్నం సిటీ, విజయవాడ సిటీ, ఇంటిలిజెన్సు, ఉమ్మడి రాష్ట్రంలోని పోలీసు అకాడమీలోను, పలు తెలంగాణ ప్రాంతాల్లో వివిధ హెూదాల్లో సమర్ధవంతంగా విధులు నిర్వహించి, పోలీసు ఉన్నతాధికారుల నుండి ప్రశంసలు పొందారు. ఆర్మ్డ్ రిజర్వు అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సోల్మన్ ను ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, జిల్లా పోలీసు కార్యాలయ ఎఓ వెంకట రమణ, ఆరి పి.మరియన్ రాజు, కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకరరావు, కామేశ్వరరావు తదితరులు పుష్ప గుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎంపీ

విశాలాంధ్ర- దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పల నాయుడు అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి ముఖ్యఅతిధిగా గజపతినగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ హాజరయ్యారు. బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎంపీ నిధులతో నియోజకవర్గ అభివృద్ధికి, దత్తిరాజేరు మండలంను అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం బొత్స అప్పల నరసయ్య మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానన్నారు. పలు శాఖా ధికారులతో ప్రగతి నివేదిక వినిపించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు, సమన్వయం లోపం అయితే తమ దృష్టికి తీసుకురా వాలన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, రెండో వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, మాజీ జడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు, పిఏసిఎస్ అధ్యక్షులు సుమల శ్రీనివాసరావు, ఎంపీడీవో సుబ్ర హ్మణ్యం, ఇన్చార్జి తాసిల్దారు రమేష్, సర్పంచులు, ఎంపీటీసీలు, పలు సాకాధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కంటకాపల్లి, గొల్లపేట గ్రామాల్లో విద్యుద్దీకరణ



విశాలాంధ్ర -కొత్తవలన: మండలంలోని కంటకా పల్లి గ్రామంలో గల శారద స్టీల్స్ కర్మాగార యాజమాన్యం ఆధ్వర్యంలో కంటకాపల్లి గ్రామంలో 65, గొల్లపేట గ్రామంలో 35 ఎల్.ఇ.డి. దీపాలతో విద్యుద్దీకరణ చేసినట్లు కర్మాగార సీనియర్ మేనేజర్ ప్రభాత్ మోహన్ తెలిపారు. మండలం లోని ఇతర గ్రామాల్లో 72 సోలార్ విద్యుత్ దీపాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.జి.ఎం. హెచ్. సన్యాసి రావు, అసిస్టెంట్ మేనేజర్ జి. శంకర రావు, అధికారి కె. సంతోష్ కుమార్, గ్రామ సర్పంచ్ లు అప్పల రమణ, కృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

గృహ నిర్మాణంలో పురోగతి రావాలి

కలెక్టర్ నిశాంత్ కుమార్



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణ గృహ నిర్మాణాలలో మరింత పురోగతి రావాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పార్వతీపురం, ఇతర ప్రాంతాల గృహ నిర్మాణాలపై సంభందిత అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్ర వారం కలెక్టర్ కార్యాలయంలో చర్చించారు. మంజూరైన గృహాలను లబ్ధిదారులు త్వరగా నిర్మాణం చేయుటకు ప్రేరణ కల్పించాలని అధికారులను ఆదేశించారు. లబ్దిదారులకు అవసరమైన సామగ్రి సరఫరా చేయుటకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సామగ్రి సరఫరా చేసిన పదిహేను రోజుల్లో నిర్మించాలని ఆయన కోరారు. నిర్మాణాలు పూర్తి చేయుటకు పూర్తి సహాయ సహకారాలు అందించినప్పటికి నిర్మాణాలు చేపట్టకపోతే నిబంధనల మేరకు రద్దు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. అర్హత ఆసక్తి ఉన్న లబ్దిదారులకు కేటాయింపు చేయడం వలన త్వరగా నిర్మాణాలు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. డిసెంబరు 21 నాటికి గృహాల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రాదాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. నిర్మాణాల్లో పురోగతి రావాలని, బాగా జాప్యం చేసే వారికి నోటీసులు జారీకి చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కొంత మంది లబ్దిదారుల అర్హతపై వస్తున్న ఆరోపణలను పరిశీలించాలని ఆయన అన్నారు. శాసన సభ్యులు అలజంగి జోగారావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో దాదాపు 95 శాతం మ్యాపింగ్ అయిందన్నారు. ప్రభుత్వం నిర్మాణాలు వేగవంతం చేసి లబ్దిదారుల సొంతింటి కలను నిజం చేయాలనే ఆలోచనతో ఉందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకట రావు, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, మునిసిపల్ కమీషనర్ జె.రామ అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఇరువురికి గాయాలు



విశాలాంధ్ర-బెలగాం: ఆటో ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పార్వతీపురం ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరఘట్టం మండలం కిమ్మి గ్రామానికి చెందిన వాన వెంకటరమణ తన భార్య ఉషారాణితో కలసి మోటార్ సైకిల్ పై పార్వతీపురంలో ఫంక్షన్ కి వస్తుండగా గరుగుబిల్లి మండలం పెద్దింపేట గ్రామం సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈసంఘటనలో ఇరువురకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు వైద్యులు చికిత్స అందించారు ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

నిడగల్లు ఉన్నతపాఠశాలను డిఈఓ ఆకస్మిక తనిఖీ



విశాలాంధ్ర-సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లావిద్యాశాఖాధికారి డాక్టరు రమణ శుక్రవారంనాడు నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలను ఆకస్మిక సందర్శన చేశారు. పాఠశాలలో మద్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి దగ్గరుండి విద్యార్థి, విద్యార్థులకు వడ్డించారు.ఆయన కూడా రుచిచూశారు. నిర్వహణపై పూర్తిసంతృప్తి వ్యక్తంచేశారు. పాఠశాల పరిసరాలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు .నాడు-నేడు ఫేస్ 2 పనులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం, జిల్లా ఏపిటిఎఫ్ అధ్యక్షులు ఎం.శివున్నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సెంటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం అంగన్వాడి ప్రాజెక్టు మహాసభ సిహెచ్ గౌరమ్మ అధ్యక్షతన స్థానిక సుందరయ్య భావనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ మహాసభలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి మాట్లాడుతూ అంగన్వాడీలు సెంటర్లకు మౌలిక సదుపాయాలు, మంచినీరు, ప్రహరీ, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు, కుర్చీలు కల్పించాలని, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరాచేయాలని, ఆయిల్, కందిపప్పు క్వాలిటీ పెంచి వైయస్సార్ సంపూర్ణ పోషణ పెంచాలని గ్యాస్ సరఫరా చేయాలని నూతన విద్యావిధానం రద్దుచేసి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలుచేయాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ఇళ్లస్థలాలు, అంగన్వాడీల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు తొలగింపులు ఆపాలని, తొలగిం చిన అంగన్వాడీలను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని, తూర్పుగోదావరి జిల్లా రాయవరం ప్రాజెక్టులో తొలగించిన అంగన్వాడి వర్కర్ గంగాభవానీని పెద్దాపురం ప్రాజెక్టు వర్కరు ఎస్. సావిత్రి బ్రాహ్మణీని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సిహెచ్ గౌరమ్మ, కార్యదర్శిగా వి. ధర్మవతి, కమిటీ సభ్యులుగా విజయ, రాజేశ్వరి, అలివేలు, సత్యవతి, అరుణ, పద్మ, అలివేలు, జ్యోతి, తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ..

విశాఖ స్టీల్‌ప్లాంట్ పై మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలి

వామపక్ష సంఘాలు డిమాండ్ చేస్తూ నిరసన



విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : విశాఖ స్టీల్ ప్లాంట్ పై ప్రధానమంత్రి మోడీ స్పష్టమైన ప్రకటనచేయాలని కోరుతూ స్థానిక రైతు బజార్ కూడలి సమీపంలో గల అంబేద్కర్ విగ్రహంవద్ద వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు యమ్మల మన్మధరావు ఆధ్వర్యంలో శుక్రవారంనాడు నిరసన కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా వామపక్ష, ప్రజాసంఘాల నాయకులుమాట్లాడుతూ నరేంద్రమోడీ, బిజెపి ఆంధ్రరాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేశారన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను పోస్కో కంపెనీకి కారుచౌకగా కట్టపెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని, లక్షమంది కార్మికులు, వేలాదిమంది ప్రజలు బ్రతుకుని, ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా కార్పోరేట్లకు స్టీల్ ప్లాంట్ ను ధారాదత్తం చేస్తున్నారని చెప్పారు.మోడీ పర్యటన సందర్భంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంటును అమ్మడంలేదని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.దాన్నివందశాతం సామర్థ్యంతో నడపాలని, ప్రత్యేక హెూదా ఇస్తామని, విభజన హామీలు నెరవేరుస్తామని ప్రకటన కూడాచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి కోరంగి మన్మథ రావు,సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ ఎంఎల్ నాయకులు నర్సింగరావు, రైతు కూలి సంఘం నాయకులు భాషా, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు రాజు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి. సంగం, ఇఫ్టూ నాయకులు సర్వేశ్వరరావు, సిఐటియు అధ్యక్షులు గొర్లి వెంకటరమణ, బివి రమణ, ఎస్ఎఫ్ఐ రాజశేఖర్. ఎఐఎస్ఎఫ్ నాయకులు బిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చే ఇళ్ల పట్టాలు రద్దు చేసే హక్కు ఎవరికీ లేదు

బిజెపి పార్వతీపురం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు



విశాలాంధ్ర-బెలగాం: జగనన్న కాలనీల్లో లబ్దిదారులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేసే హక్కు ఎవరికీ లేదని బిజెపి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం బిజెపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయానికి గృహాలు నిర్మించకపోతే వాటిని రద్దుచేసి వేరే వారికి ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు మీడియా ముఖంగా మాట్లాడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదలకు ప్రభుత్వం ఒకసారి ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసే అధికారం ఏ ఒక్కరికీ లేదని గుర్తు చేశారు. అంతా మాఇష్టం అన్నట్లు మాట్లాడడం సరికాదన్నారు. కావాలంటే 376 ఆర్డినెన్స్‌ను చదువుకోవాలని హితవు పలికారు. మీ మాటలు అక్రమాలకు ఆజ్యం పోసినట్లుగా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రొంపిల్లి తిరుపతిరావు, అల్లూరి పేర్రాజు, అప్పారావు, కనకారావు, మాస్ బాలు యాదవ్, సూరిబాబు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు..

మానసికవికాసానికి క్రీడలు దోహద పడతాయి: డిఈఓ డా॥ రమణ



విశాలాంధ్ర-సీతానగరం: విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహద పడతాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టరు ఎస్ డి వి రమణ తెలిపారు.శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ఆటలపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధ్యార్థులు క్రీడల పట్ల అవగాహన పెంచుకొని ఆదిశగా ఉన్నత స్థానాలను చేరుకోవాలని కోరారు. త్రోబాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ ఆటలపోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈపోటీల కార్యక్రమాల్లో హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయుల జగన్నాథరావు, పిఆర్టీ యు జిల్లా అధ్యక్షులు వోలేటి తవిటినాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, గాంధీ,తిరుపతిరావు, వాసు,వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా డిఈఓకు బైజుస్ ఆప్ విషయములో మేమోలు జారీచేసిన అంశం, పలు ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టిలో పెట్టినట్లు వోలేటి తవిటినాయుడు విలేకరులకు తెలిపారు.

కార్మికుల పిఎఫ్ బకాయిలకై కొంత సొమ్ము కేటాయించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి

విశాలాంధ్ర-పార్వతీపురం: లచ్చయ్యపేట ఎన్ సి ఎస్ చక్కెర కర్మాగారంలో రైతులకు బకాయిలు 16.85కోట్ల రూపాయలు చెల్లించిన అధికారులు మిగులు డబ్బులలో కార్మికులకు సంబంధించిన పి.ఎఫ్ బకాయిలగురించి కొంతడబ్బులు జమచేసి న్యాయం చేయాలని మన్యం కలెక్టర్ నిషాంత్ కుమార్ ను కార్మికులు కలిసి విన్నవించుకున్నారు. శుక్ర వారం సాయంత్రం వారు జిల్లా కలెక్టరు ను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. పి ఎఫ్ కోసం కోటిన్నర కేటాయిస్తే కొంతమంది కార్మికులకు పెన్షన్ సౌకర్యం కలుగు తుందని కార్మికులు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎస్. సన్యాసిరాజు,ఎస్ .త్రినాధ, డి.రమేష్, సత్యనారాయణ, సూర్య నారాయణ, వెంకట్రావు తదితర కార్మికులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఎన్ సి ఎస్ భూములను ఆర్ ఆర్ యాక్టు ద్వారా 20కోట్ల 5లక్షల రూపాయలకు అమ్మగా ఇప్పటికే రైతులబకాయిలు 16.85 కోట్ల రూపాయలు చెల్లించిన సంగతి తెలిసిందే. ఆర్ ఆర్ యాక్టు అమలు ద్వారా వచ్చిన డబ్బులలో రైతులతరువాత తమకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని గత రెండేళ్లుగా కార్మికులుకూడా పలుసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తిచేస్తున్నారు. వారు ఎన్నో నిరసనలను, ఆందోళనలు శాంతియుతంగా చేశారు. రెండేళ్ళుగా కర్మాగారంలో గానుగ నిలిపివేయడంతో చాలామంది కార్మికులకు గ్రాట్యుటీ, పిఎఫ్, ఎల్ఐసి, జిఐసి తదితర బకాయిలు యాజమాన్యం చెల్లించలేదు. ప్రస్తుతం కలక్టర్, ఇతరఅధికారులు మానవతా దృక్పథంతో ఆలోచనచేసి పిఎఫ్‌కై కొంత మొత్తాన్ని కేటాయించి జమచేస్తే కొంతమంది కార్మికులకు నెల నెలా పెన్షన్ స్కీమ్ వరిస్తుందన్నది వాస్తవం.

స్టీల్‌ప్లాంట్ అమ్మకాలపై నరేంద్ర మోడీ స్పష్టత ఇవ్వాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, తోటజీవన్న

విశాలాంధ్ర-కురుపాం: నరేంద్ర మోడీ విశాఖ పర్యటన లో స్టీల్ ప్లాంట్ ను అమ్మబోమని స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేసారు. శుక్రవారం మండలంలోని మొండింఖల్ శాంతినగర్ వద్ద జరిగిన సీపీఐ కురుపాం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం లో మాట్లాడుతూ.దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఏ మొఖం పెట్టుకొని విశాఖ వస్తున్నారని ఆయన ప్రశ్నిం చారు. ఈ సందర్భంగా ఈ క్రింది వాటిపై మోడీ స్పష్టత చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను చేయొద్దు.. రాష్ట్ర విభజన హామీలను అమలు పరచాలి. వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్యాకే జీని ప్రకటించాలి. విశాఖ రైల్వే జోన్‌ను వెంటనే ఏర్పాటుచేయాలి. రణస్థలంలో ఏర్పాటు చేస్తున్న అతి ప్రమాదకరమైన అను విద్యుత్ కేంద్రాన్ని విరమించుకోవాలంటూ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు, జిల్లా సమితి సభ్యులు మోహన్ రావు, పీ. ప్రసాద్, సింగన్న, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు పోస్టుమార్టం నిర్వహించిన పశువైద్యాధికారి



విశాలాంధ్ర-పార్వతీపురం: గురువారం ఉదయం నాల్గున్నర గంటల సమ యంలో రాష్ట్రీయ రహదారిపై లారీఢీకొనడంతో రెండుఎద్దులు మృతి చెందడంతో వాటికి శుక్రవారం ఉదయం నిడగల్లు పశువైద్యులు సిరిపురపు రామారావు పోస్ట్‌మార్టం నిర్వహించారు. సీతానగరం-పార్వతీపురం సరిహద్దులో మరిపివలస దగ్గరలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పార్వతీ పురం మండలం కారాడవలస గ్రామానికి చెందిన పిన్నింటి సాంబయ్య, దొగ్గ తిరుపతి, దొగ్గ రమేషుల నాటుబండ్లను లారీఢీకొనడంతో వారి రెండు పశువులు అక్కడికక్కడే మృతిచెందిన సంగతితెలిసిందే. దీనిపై కేసు నమోదు కావడంతో శుక్రవారం రైతులు, పోలీసులుసమక్షంలో పశువైద్యులు పోస్ట్ మార్టం నిర్వహించి వాటినివేదికను పోలీసులకు,ఉన్నతాధికారులకు అందజేస్తానని డాక్టరు రామారావు తెలిపారు.

ఉపాధి పనులకు గ్రామ సభ అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: గ్రామాల్లో జరగబోవు ఉపాధి హామీ పథకం పనులకు గ్రామ సభ అనుమతి తప్పనిసరి అని ఉపాధి హామీ ఎపిడి చంద్రమ్మ అన్నారు . శుక్రవారం మండలంలోని చిన్న బండపల్లి గ్రామంలో సర్పంచ్ గండి శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్న బండపల్లి గ్రామంలో 2023 -24 సంవత్సరానికి 2.56 కోట్ల రూపాయలతో పనులను ఆమోదించారు. చెత్తతో సంపద తయారీ కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఏపీ డి, డీఎల్డీవో చంద్రమ్మ మాట్లాడుతూ గ్రామ సభలో అనుమతి పొందిన పనులన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా వేతన్దారులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చూడాలని తెలిపారు. ఉపాధి హామీ పనులతో సామాజిక అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు అవసరమయ్యే పనులు ముందుగానే గుర్తించడం వల్ల ఇబ్బందులు ఉండవని అన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

జూనియర్ సివిల్ జడ్జి వాణి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : నేడు శృంగవరపుకోట మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ ఎస్.వాణి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులను రాజీ పరిష్కారము చేసుకోవచ్చని కక్షిదారులకు పిలుపునిచ్చారు. సివిల్ కేసులలో రాజీ పరిష్కారము చేసుకోవడం ద్వారా కక్షిదారులు చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి వాపసు పొందడం జరుగుతుందని తెలియజేశారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పత్రికాముఖంగా కోరారు.

గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ యువకుడు

- ద్విచక్ర వాహనంపై పరారైన మరో యువకుడు

నిందితుడు ప్రహ్లాద్

విశాలాంధ్ర-శృంగవరపుకోట : సినీ పక్కీలో ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తూ కాకతాళీయంగా ఎస్.కోటలో ఒక యువకుడు పట్టుబడగా మరో యువకుడు పరార య్యాడు. వివరాలిలా ఉన్నాయి. అరకు సమీపంలోని జోడిగూడ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఒక చేతి సంచి, భుజానికి తగిలించుకున్న బ్యాగుతో పల్సర్ బైకుపై వస్తూ శుక్రవారం సాయంత్రం ఎస్.కోట వందన లాడ్జి సమీపాన మెడికల్ షాపు వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టి కింద పడిపోయారు. దీంతో చేతి సంచి పగిలిపోయి గంజాయి ప్యాకెట్లు రోడ్డుపై పడ్డాయి. వెంటనే అక్కడ ఉన్న స్థానిక యువకులు పట్టుకునే ప్రయత్నం చేయగా లక్కి అనే యువకుడు వచ్చిన బైకుపై తప్పించుకోగా పాంగి ప్రహ్లాద్ (22) అనే యువకుడు భుజానికి తగిలించుకున్న బ్యాగుతో వెంకటేశ్వర థియేటర్ సందులోంచి పరుగెడుతూ పట్టుబడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వచ్చి బ్యాగులో ఉన్న గంజాయి ప్యాకెట్లతో సహా యువకు డిని, రోడ్డుపై పడ్డ గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని స్టేషన్ కు తరలించారు. పట్టుబడ్డ గంజాయి సుమారు 15కిలోలు ఉండవచ్చని అనుకుంటున్నారు.

నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-తెర్లాం: భాడంగి మండ లంలో శుక్రవారం బాడంగి జడ్పీ పాఠ శాలలో బొబ్బిలి నియోజకవర్గ స్కూల్ గేమ్స్ సెక్రటరీ నల్ల వెంకట నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న పాఠశాల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక లను స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ జగన్మోహన్ రెడ్డి నాయ కత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ పాఠశాల అభివృద్ధికి దాంతో పాటు పిల్లల క్రీడాభివృద్ధికి ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని మండలస్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు ఎంపికలు జరిపి జాతీయస్థాయికి అక్కడినుంచి ఒలింపిక్ స్థాయికి ఎదిగేటట్లు ప్రోత్స హిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థి వినియోగించుకోవాలని తెలిపారు. క్రీడలకు నిర్వహణకు సహకరించిన వారికి పాఠశాల తరపున హెచ్ఎం త్రినాథరావు ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానం చేశారు. క్రీడా పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. వివిధ క్రీడాంశాలకు 620 మంది విద్యార్థులు పాల్గొని అండర్17, అండర్14 ఏజ్ గ్రూపులో కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, చెస్ లో ఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎం పి పి తో పాటు ఇతర నాయకులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

మెట్టు భూములలో రభీ సాగును పెంచండి

జిల్లా ప్రకృతి వ్యవసాయ కేంద్రం ఆర్టీవో హేమ సుందర్



విశాలాంధ్ర-వేపాడ : మెట్టు భూముల్లో రవి సాగును పెంచాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ కేంద్రం రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ హేమ సుందర్ అన్నారు. మండ లంలోని బొద్దాం గ్రామంలో గల సుస్థిర సెంద్రీయ వ్యవసాయ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్టు భూముల్లో రభీ, సాగుపై రైతులను అవగాహన పరచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఇందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేశారు. రభీ సాగుకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేయగా వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే బొద్దాం గ్రామంలోని దేశి వరి ,వరి బర్మా వరి బ్లాకులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు ,తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రైతులకు న్యాయం జరగాలి



విశాలాంధ్ర-గంట్యాడ: గతంలో ధాన్యం కొనుగోలులో రైతులకు చాలా నష్టం జరిగింది. ఇప్పుడు అలా జరగకుండా చూడాలని వ్యవ సాయ సలహా మండలి సమావేశంలో గంట్యాడ ఎంపీపీ పీరు బండి హైమావతి అన్నారు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారంజరిగిన వ్యవసాయ సలహా మండల సమావేశానికి ఎంపీపీ హైమావతి ముఖ్యఅతిథిగా హాజరైనారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ధాన్యము ముక్కఅవుతున్నాయని కారణంతో బస్తా దగ్గరఐదు నుంచి 10 కేజీలు ధాన్యం మిల్లర్లు తీసుకున్నారు ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా అధికారులు చూడాలని ఎంపీపీ హైమావతి అన్నారు. రవాణా మరియు గోనే సంచులు డబ్బులు కూలీలు డబ్బులు గత సంవత్సరము ఎవ్వరికీ అందలేదు మరి ఈ సంవత్సరము ఈ డబ్బులు అన్ని జం చేస్తారని తెలిసింది ఈ విధంగా జమ చేస్తే రైతులకు మేలు చేసిన వారు అవుతారు పంట కోతలు మొదలవు తున్నాయి . టార్పాలన్స్ అవసరం కనుక రైతులందరికీ సబ్సిడీపై అందజేమని కోరారు. ఏడి నాగభూషణం మాట్లాడుతూ వరి కోతలు తరువాత మినుములు పెసలు రాయితీతో అందజేస్తాము కనుక రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ జడ్పిటిసి నరసింహమూర్తి ఏవో శ్యామ్ కుమార్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామనాయుడు వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

చిట్టిగురువుల పరీక్షను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ఈనెల 13న చిట్టి గురువులకు నిర్వహించనున్న మదింపు పరీక్షను విజయవంతం చేయాలని ఎంపీడీఓ గిరిబాల కోరారు. నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కార్య దర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరక్షరాస్యులను అక్షరాస్యలను చేసే బృహత్తర కార్యక్రమం చిట్టిగురువులు కార్యక్రమమని చెప్పారు. వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి పరీక్షకు హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరీక్ష కేంద్రాలను ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రత్యేకాధికారి, ఎంఇఓ పర్యవేక్షిస్తారని చెప్పారు.

ఎస్సీ బాలికల వసతిగృహం ఆకస్మిక తనిఖీ



విశాలాంధ్ర-గజపతినగరం: గజపతి నగరంలోని ఎస్సీ బాలికలు వసతి గృహాన్ని గజపతినగరం ఎంపీపీ జ్ఞాన దీపిక, ఎంపీడీవో కిషోర్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వంటగది స్టోర్ రూమ్ బాలికల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారి గౌరీకి పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ డబ్ల్యుఓ స్వరూప కుమారి పాల్గొన్నారు

విద్యా విధానానికి పునాది వేసిన వ్యక్తి అబ్దుల్ కలాం ఆజాద్

కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం/ పార్వతీపురం టౌన్: భారతరత్న మౌలానా అబుల్ కలాం జయంతి ఘనంగా జరిగింది. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమం శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ దేశ మొదటి విద్యా శాఖ మంత్రి గా పనిచేసి, గొప్ప విద్యా విధానానికి మంచి పునాది వేశారని కొనియాడారు. నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా దీర్ఘకాలిక వ్యూహంతో విద్యా విధానాలు ప్రవేశపెట్టారని ఆయన చెప్పారు. విద్యా వ్యాప్తికి పెద్ద ఎత్తున కృషి చేసారని ఆయన అన్నారు. జామియా మిలియా విశ్వవిద్యాలయం స్థాపించారని చెప్పారు. మక్కాలో గౌరప్రదమైన కుటుంబంలో జన్మించి భారత దేశం విచ్చేసి సేవలు అందించారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. వార పత్రిక ప్రారంభించి ప్రజలలో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి నింపి, స్పందన రప్పించారని దానితో ఇంగ్లీష్ ప్రభుత్వం పత్రికను నిషేధించిందని చెప్పారు. మరో పత్రిక స్థాపించి ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారని తెలిపారు. యుక్త వయస్సులోనే భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారని అన్నారు. దేశ విభజన, ఇతర సందర్భాల్లో మతపరమైన దాడులు జరుగుతున్నప్పుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉదారంగా పనిచేస్తూ, ఉద్రిక్తతలు తగ్గించుటకు ఎంతగానో కృషి చేశారని ఆయన వివరించారు. ఆజాద్ జయంతి రోజున అల్ప సంఖ్యాక వర్గాల దినోత్సవంగా ప్రకటించడం శుభసూచకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బగాది జగన్నాథ రావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజుల వీణ, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి. ఆర్.కృష్ణాజి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా విద్యా శాఖ అధికారి డా.ఎస్.డి.వి.రమణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి జి.వరహాలు, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా సమన్వయ అధికారి డా. ధవళ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కలామ్ జయంతి వేడుకలు

శృంగవరపుకోట: ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతదేశ మొదటి విద్యా శాఖ మంత్రి 'మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 'జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి పాఠశాల ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రహీం షేక్ లాల్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర పోరాటంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ తన వంతు పాత్రను పోషించారని, అలాగే స్వాతంత్రానంతరము భారతదేశానికి మొదటి విద్యా శాఖ మంత్రిగా తమ సేవలను అందించారని, ఆయన జన్మదినోత్సవాన్ని జాతీయ విద్యాదినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రహీం షేక్ లాల్, వి.ఈ. సత్యనారాయణ, పొట్నూరు శ్రీరాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

విశాలాంధ్ర-బొబ్బిలి:రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మరింత మెరుగు కు రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రణాళికలు సిద్ధం చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. జాబ్ మేళాలో భాగంగా వివిధ రకాలకు చెందిన కార్పొరేట్,మల్టీ నేషన్స్ కంపెనీలు అవసరమైన స్థానాల్లో ఉద్యోగ నియామకాలను చేపట్టింది.ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్, ఫార్మసీ వంటి విద్యార్హతులతో వివిధ స్థాయిల కొలువులు ఎంపికను కంపెనీ ప్రతినిధులు చేపట్టారు. నియోజకవర్గంతో పాటు జిల్లాలో పలు ప్రాంతాల నుండి అత్యధిక మంది విద్యార్హతల గల యువకులు జాబ్ మేళాకు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ యువత చదువుతున్న సమయంలోనే ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుచుకు నేందుకు విషయ అవగాహనతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పట్ల మక్కువ కలిగి ఉండాలని సూచించారు.ఉపాధి అంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదని, వీటికి ధీటుగా పలు కార్పొరేట్ సంస్థలు అత్యధిక వేతనాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.ఉద్యోగాల్లో చేరే నాటికి చేసే పని పట్ల అవగాహన కలిగి ఉంటే మెరుగైన వేతనాలు లభిస్తాయని అన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టిం దన్నారు. బొబ్బిలి నియోజకవర్గానికి గాను స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.మూడు నెలలు పాటు రెసిడెన్షియల్ విధానంలో ఉద్యోగ నైపుణ్యం పెంపొందించేందుకు ఇది ఉపకరిస్తుం దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణు గోపాలనాయుడు, జడ్పిటిసి సంకిలి శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని రైతుభరోసాకేంద్రాల ద్వారా ప్రభుత్వ ధరకే కొనుగోలు

విశాలాంధ్ర-సీతానగరం: రైతుల దాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ వాకడ నాగేశ్వరరావు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ పోల ఈశ్వర నారాయణలు తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ పోల ఈశ్వరనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు భరోసా కేంద్రములు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా వ్యవహరిం పబడతాయని, ఇ-పంట నమోదు ప్రకారం రైతు భరోసా కేంద్రాలు మూడు కేటగిరీలుగా వర్గీకరించబడ్డాయని చెప్పారు. ఏకేటగిరీ రైతు భరోసాకేంద్రంకి ఒక టెక్నికల్ అసిస్టెంట్, నలుగురు వాలంటీర్లు, బి, సి కేటగిరీ రైతుభరోసా కేంద్రాలకు ఒక టెక్నికల్ అసిస్టెంట్, ముగ్గురు వాలంటీర్స్ నియమించడం జరిగిందన్నారు. ఇందులో వాలంటీర్లు ప్రొక్యూర్మెంట్ అసిస్టెంట్ మరియు రూట్అసిస్టెంట్ గా వ్యవహ రిస్తారని, గ్రామ వ్యవసాయ సహాయకులు సూపర్వైజర్ ఆఫీసర్గా వ్యవహరిస్తారని తెలిపారు. నేరుగా రైతు కళ్ళాల వద్దనుండి ధాన్యం సేకరించబడుతుందన్నారు. ప్రక్రియ జరుగుతుందన్నారు. మద్దతుధర ప్రకారం క్వింటాకు 2040గా ధాన్యం కొనుగోలు చేస్తా రని, గోనేసంచులు రైతులకు రైతు భరోసా కేంద్రం వద్ద ఇవ్వటం జరుగుతుందన్నారు.ఒకవేళ రైతులే సొంతంగా గోనేసంచులు కొనుగోలు చేసినచో వారికి ధాన్యం డబ్బులతో పాటు ఈడబ్బులుకూడా జమవుతాయని తెలియచేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు, జడ్పీటిసి బాబ్జి, మండల వ్యవసా యధికారి అవినాష్,మండల పశు వైద్య అధికారి డాక్టరు రామారావు, సివిల్ సప్లైస్ టెక్నికల్ అసిస్టెంట్, ఎంపీటీసీలు, సర్పంచులు, మండలి బోర్డ్ సభ్యులు, సీహెచ్సీ గ్రూప్ సభ్యులు, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జగన్ మోసాన్ని ప్రజలకు తెలియజేయాలి

జనసేనపార్టీ నాయకులు ఆదాడ

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు జగనన్న ఇళ్ల వలన పేదలందరి కన్నీళ్లు పెట్టుకుంటున్న బాధలను సోషల్ మీడియాలో ప్రజలకు తెలియజేయాలని చెప్పే కార్యక్రమంలో భాగంగా జనసేనపార్టీ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ జంక్షన్ వద్ద అంబేత్కర్ సామాజిక భవనంలోమీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఆదాడ మోహనరావు మాట్లాడుతూ జగన్ నవరత్నాలలో ఒక్కటైన జగనన్న ఇళ్లు మంజూరులో జరిగిన మోసాలను వెలికితీసి ప్రజలకు ప్రతీఒక్క జనసైనుకుడు, వీర మహిళలు తెలియజేయాలని కోరారు. కాగా రాష్ట్రంలో జగన్ రెడ్డి రాష్ట్రం మొత్తమ్మీద మొదటి విడతలో 18,63,552 గృహాలను 2022,జూన్ నాటికి మంజూరు చేస్తామని మాట ఇచ్చి, ఇప్పటికీ ఒక్క ఇళ్లు కూడా ఇవ్వలేదని, జగనన్న ఇళ్ల కోసం బీసీ,ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములు కొనుగోలులో కూడా వేలకొట్లలో కుంభకోణాలు జరిగాయని,ఈ అక్రమాలను బయటకు తీసి ప్రజలకు తెలియ రుస్తామని అన్నారు. నవంబర్ 12, 13, 14 తేదీల్లో ఈ జగనన్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మొదటిరోజు, నవంబర్, 12వ తేదీ శని వారం గుంకలాంలో జగనన్న నగం సగం నిర్మిత మైన కాలనీలో నిరసన చేపడతామని తెలిపారు.

సీతం ఎన్సిసి బాలికల నమోదు

విశాలాంధ్ర -విజయనగరంటౌన్ : సీతం ఇంజనీరింగ్ కళాశాల 2(ఎ) బాలికల బెటాలియన్ ద్వారా యస్ డబ్ల్యూ క్యాడెట్లకై ఎన్సిసి నమోదు విజయ నగరంలో ఎన్సిసి నిర్వహించారు. కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 200 మీటర్ల పరుగు, వైద్య (ఎత్తు మరియు బరువు), ఇంటర్వ్యూ ఆధారంగా క్యాడెట్ల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. సుబేదార్ అప్పా సాహెబ్ మరియు సిపాయి మురళీ కృష్ణ(పిఐ సిబ్బంది) 2(ఎ) బాలికల బెటాలియన్, ఎన్ సి సి ,విశాఖపట్టణం నుండి ఈ ఎంపికను నిర్వహించారు. డైరెక్టర్ డా. ఎం. శశి భూషణ్ రావు , ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ్మూర్తి , వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ వి లక్ష్మి , ఎన్సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం. వరలక్ష్మి, ఎస్. ప్రశాంత్, సిఎస్ఓ కె.సత్యనారాయణ, పిడి మహేష్ ,ఎన్సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

నూతన ఉత్పత్తుల ప్రోత్సాహంతో ఔత్సాహిక సంస్థలు అభివృద్ధి

విశాలాంధ్ర -విజయనగరంటౌన్: నూతన ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా ఔత్సాహిక సంస్థలు అభివృద్ధి చెందుతాయని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో విజయనగరం సేల్స్ ఫీల్డ్ ఫోర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ వ్యాపార వస్తువుల ప్రదర్శన, అమ్మ కాల శాలను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించిన ఆమె అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ ను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ నూతన వ్యాపార సంస్థలను ప్రోత్స హించడం, ఉత్పత్తు లను వినియోగించడం ద్వారా ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. నాణ్యమైన ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంతో రుచికరమైన, కల్తీ లేని ఆహార పదార్థాలు ప్రదర్శన, అమ్మకాలను ఏర్పాటు సంతోషదాయక మన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పానకాలరావు, జామి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి ప్రతిధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

విశాలాంధ్ర-నెల్లిమర్ల : రైతుల నుంచి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే సలహా సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు అన్నారు. నెల్లిమర్ల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా సంఘం సమావేశం అధ్యక్షులు జమ్ముల నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అంబళ్ల శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.పూర్ణిమ మాట్లాడుతూ మండలంలో 4685 ఎకరాలకు ఈ క్రాప్ పూర్తయిందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మదలిచిన వారు రైతుభరోసా కేంద్రాల్లో వివిఏలను సంప్రదించి తమ పేరు ఈ క్రాప్ లిస్టులో ఉందా లేదా తెలుసుకుని షెడ్యూలింగ్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో వెటర్నరీ వైద్యులు చంద్రశేఖర్ లంపీస్కిన్ వ్యాధిపై వివరించారు. ఉద్యానవన శాఖ అధికారి దీప్తి జామ, బొబ్బాయి, ఆయిల్ ఫామ్ పంటల సాగుపై వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ గిరిబాల, ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందజేస్తా : వైద్యులు ఉషారాణి

విశాలాంధ్ర-సీతానగరం: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందజేస్తానని వైద్యులు పి. ఉషారాణి తెలిపారు. స్థానిక పి హెచ్ సిలో రెండో మెడికల్ ఆఫీసర్ గా ఆమె శుక్రవారం జాయిన్ అయ్యారు.ఇంతవరకు ఇక్కడ రెండో మెడికల్ ఆఫీసరుగా పనిచేసిన డాక్టరు నీలిమ ప్రసూజకు ఉన్నతవిద్య సీటు రావడంతో ఆమె గురువారంనాడు రిలీవ్ అయ్యారు. వెంటనే ప్రభుత్వం కూడా కొత్తగా వైద్యులను నియమించడంతో ఉషారాణి ఇక్కడ జాయిన్ అయ్యారు. ఆమెమాట్లాడుతూ స్థానిక ప్రాథమిక అరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష, వైద్యసిబ్బంది, మండల ప్రజాప్రతినిదులు,అధికారులు సహకారంతో తనవంతు సేవలు అందించేందుకు కృషిచేస్తానని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు సేవలు అందించేందుకు ఎల్లపుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఉద్యోగంలో కొత్తగా జాయిన్ అయిన తాను అందరిసహకారంతో సేవలు అందిస్తూ, కుటుంబ వైద్య విధానం ద్వారా కూడా ఇంటింటికీ వెళ్లి సేవలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

దళితుల భూమి వారికే కేటాయించాలి

లేనిచో కలెక్టరేట్ ఎదుట ఆందోళన

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం మండలం ఎమ్మార్.అగ్రహారంలో దళిత నాయకులు చింతాడ రామారావు భూమి సర్వే నెం 151/2 లో గల దళితుల భూమిని ఎమ్మార్. అగ్రహారం నకు చెందిన చెట్ల సత్తెమ్మ, రామకృష్ణ మరి కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించారు. ఈ విషయం రెవిన్యూ అధికారులకు విన్నవించిన ప్రయోజనం లేదు, ఇప్పటికైనా అదికారులు స్పందించి దళితుల భూమిని దళితులకు అప్పగించి న్యాయం చెయ్యాలి లేని పక్షంలో మేము కలెక్టర్ సమక్షంలో ఉద్యమం చేస్తామని చింతాడ రామారావు తెలిపారు. ఈ విషయం పై వీఆర్ఓ నర్సింనాయుడు ను వివరాలు కోరగా మీ సమస్యను త్వరతగతిగా పరిష్కరిస్తామని అని చింతాడ రామారావు తో వి అర్ ఓ నరసింహనాయుడు తెలిపారు.

ప్రజలకు ఎల్ల వేళలా వైద్యం అందుబాటులో ఉంచేందుకు చర్యలు

కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు రామిరెడ్డి

విశాలాంధ్ర పార్వతీపురం/పార్వతీపురం టౌన్: ప్రజలకు ఎల్ల వేళలా వైద్యం అందుబాటులో ఉంచుటకు చర్యలు తీసుకుంటున్నామని ప్రజా ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డా .వి.రామిరెడ్డి అన్నారు. గురు వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 873 వైద్యాధికారుల పోస్టులు శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో ఖాళీ వున్న పోస్టులు దఫదఫాలుగా కౌన్సిలింగ్ చేసి ఆసక్తి గల, ఎం.బి.బి.యస్ అర్హత వున్న అభ్యర్ధులను గిరిజన, మైదాన ప్రాంతాలలో నియమించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. భర్తీ కానీ కొన్ని ఖాళీలను నవంబరు 9, 10 తేదీల్లో కౌన్సిలింగ్ చేసి నియమించామని ఆయన చెప్పారు. ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న కొంత మంది వైద్యులు ఉన్నత చదువులకు ఎంపిక కావడం, వారి స్థానంలో వైద్యులను నియమించడం జరిగిందని తెలిపారు. కొత్తగా నియమించిన వైద్యులు చేరిన తరువాత మాత్రమే ఉన్నత విద్య కోసం వెళ్ళే వైద్యులను రిలీవ్ చేయమని జిల్లా వైద్యాధికారులను వ్రాతపూర్వకంగా ఆదేశించామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల మైదాన, గిరిజన ప్రాతాలలో సక్రమంగా ప్రజలకు వైద్యంఅందేటట్లు అన్నిచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన వివరించారు.

ఈ ఏడాది ప్రభుత్వం ద్వారానే ధాన్యం కొనుగోళ్లు

వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మిల్లర్లకు సంబంధం లేకుండా ప్రభుత్వమే ఈ దఫా ధాన్యం కొనుగోళ్లు చేయనుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్పష్టం చేశారు. ఎస్.కోట రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది సక్రమంగా రైతులు నుండి ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చూడాలని కోరారు. అలాగే పశుసంవర్ధక శాఖ నుండి లింగనిర్ధారిత వీర్యం పథకం, సబ్సిడీపై సూచనలు చేశారు. వ్యవసాయాధికారి రవీంద్ర మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు, సోషల్ ఆడిట్, గ్రామసభల గురించి తెలిపారు. ఈ-క్రాప్ వివరాలు పూర్తిగా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. కాగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వమే ఈ ఏడాది కూడా వరి ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు సరఫరా చేయాలని, ధాన్యం తూకంలో కూలీలకు అవసరమైన నగదును ప్రభుత్వం అందజేసేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో సత్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిందాల్ కంపెనీ మరియు ఒకినావా స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంపియన్షిప్ ఆధ్వర్యంలో జరిగిన ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్షిప్ 2022 లో సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. దీనిపై సత్యా కళాశాల లో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశిభూషణరావు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు కరాటే లో ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం సాయి దేవమణి, ఎన్సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం సత్యవేణి, అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ : ఎమ్మెల్యే బడ్డుకొండ

విశాలాంధ్ర-డెంకాడ: నేను విన్నాను నేను ఉన్నాను అంటూ ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుని ఆ సమస్యలను ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం వచ్చిన మూడు సంవత్సరాల నాలుగు నెలలలో 98% హామీలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. చొల్లంగి పేట సచివాలయ పరిధిలోని పోతాయి పాలెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండవ రోజుశుశుక్రవారం నిర్వహించారు. ముందుగా పోతాయి పాలెం గ్రామంలో గత నెలలో సంభవించిన అగ్ని ప్రమా దానికి బాధిత లబ్ధిదారులకు ప్రతి ఇంటికి ఐదువేల రూపాయలు చొప్పున 6 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చేశారు. అనంతరం డి-కొల్లం గ్రామానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి గ్రామ సర్పంచ్ అట్టాడ శివకృష్ణ, కోరాడ కనకరాజు, టి.శ్రీనివాసరావు, ఎంపిటిసి కిరణ్, గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, పిఏసిఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, ఎంపీడీవో డిడి స్వరూపరాణి, ఏఎంసి వైస్ చైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భీమా చెక్కులు అందజేత

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని భర్తవానపాలెం గ్రామంలో, పాల ఉత్పత్తిదారుల సంస్థకు పాలు సరఫరా చేసే, సహజ మరణం చెందిన దేవుపల్లి దేముడు భార్య దేవుడమ్మకు, విశాఖ డైరీ సంక్షేమ పథకం నుండి, రూ.30 వేలు చెక్కును శుక్రవారం అందించారు, అదేవిధంగా పాడిపశువులు మృతి చెందిన, రైతులు పోతలు సన్యా సమ్మకు రూ.24వేలు, దేవుపల్లి, సత్యవమ్మకు,రూ..63000లు బీమా చెక్కులు అందజేసినట్టు సంఘం అధ్యక్షుడు పోతల వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నాయుడు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు

మాతృ మరణాల పట్ల పక్కా విశ్లేషణ జరగాలి

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్/బెలగాం: మాతృ మరణాలు జరిగితే పక్కా విశ్లేషణ ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం మాతృ మరణాల పట్ల జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మాతృ మరణాలు జరుగుటకు సౌకర్యాల లోపమా, వైద్య సేవలలో లోపమా, సామాజిక పరమైన అంశాలు ఉన్నాయా అనే కారణాలను విశ్లేషించాలని ఆయన స్పష్టం చేశారు. ఉప కమిటీ పక్కాగా విచారణ చేయాలని ఆయన ఆదేశించారు. హై రిస్క్ కేసులకు స్థానిక ఆర్.ఎం.పి వైద్యులు చికిత్స అందించడం పట్ల తీవ్రంగా పరిగణించాలని కలెక్టర్ ఆదేశించారు. కొన్ని మండలాల్లో హైరిస్క్ కేసులకు ఆర్.ఎం.పిలు ఐ.వి. ఫ్లూయిడ్స్ ఇవ్వడంతో గర్భిణీల ఆరోగ్య పరిస్థితుల్లో విపరీతమైన మార్పులు వచ్చి మరణాలు సంభవిస్తున్నట్లు ఏ.ఎన్.ఎం, ఆశా కార్యకర్తలు వివరించడం పట్ల జిల్లా కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు.

రక్తదానానికి ముందుకు రావాలి

ప్రసవ సమయంలో అవసరమగు రక్తపు యూనిట్లు, ముఖ్యంగా నెగిటివ్ బ్లడ్ గ్రూప్స్, అందుబాటులో ఉండక పోవడంపై కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పందిస్తూ యువత రక్త దానానికి ముందుకు రావాలని కోరారు. రక్త దానం ప్రాణ దానమని గుర్తించాలని ఆయన పేర్కొ న్నారు. రక్తదాతలు నిజమైన హీరోలు అని అన్నారు. రక్త దాతలు తమ పేర్లను జిల్లా ఆసుపత్రిలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా ఆసుపత్రిలో ఇందుకు ప్రత్యేక కౌంటర్ ను శని వారం ఏర్పాటు చేయడం జరుగుతోందని ఆయన వివరించారు. ప్రత్యేక కౌంటర్ వద్ద పేరు, ఫోన్ నంబరు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా నెగిటివ్ బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తులు ముందుకు వచ్చి సహకరించాలని, ప్రాణాలు కాపాడాలని కోరారు.

క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలి

పి.హెచ్.సి వైద్యులు, క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది గ్రామాల్లో గర్భిణీల ఆరోగ్యం పట్ల పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. హై రిస్క్ కేసులకు ఆర్.ఎం.పిలు చికిత్స చేయరాదని ఆయన స్పష్టం చేశారు. అటువంటి చికిత్స అందించేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతోందని ఆయన అన్నారు. ప్రసవ సమయంలో ఉన్న గర్భిణీల ఆరోగ్యం పట్ల అత్యంత జాగరూకత ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రాణాలతో చెలగాటం వద్దని ఆయన సూచించారు.

ప్రాంతాలను గుర్తించండి - అవగాహన కల్పించండి

మూడు కంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన కుటుంబాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. గుమ్మలక్ష్మీ పురం మండలంలో ఒక గ్రామంలో 30 సంవత్సరాల వయస్సులో 8వ కాన్పులో మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై స్పందిస్తూ ఇటువంటి అభ్యర్థులను మండలాల వారీగా గుర్తించాలని సూచించారు. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, దానిని నివారించాలని ఆయన ఆదేశించారు. ఇటువంటి ప్రాంతాలను గుర్తించి, కుటుంబ నియంత్రణ చికిత్సలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి.వాగ్దేవి, వైద్య శాఖ అధికారులు ధవళ భాస్కరరావు, అనిల్, టి. జగన్మోహన రావు, సి.హెచ్.విజయ కుమార్, జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి గొల్ల వరహాలు, తదితరులు పాల్గొన్నారు.